క్లుప్తంగా

నూజిళ్ల సేవలు అభినందనీయం



రామసుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపల్ రమణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్) ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా నూజిళ్ల రామసుబ్రహ్మణ్యం అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆయన డైట్ దూబచర్లకి బదిలీ అయిన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయనకు దుశ్శాలువాను కప్పి, నూతన వస్త్రాలు, జ్ఞాపికతో అందజేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో డైట్ ప్రిన్సిపాల్ ఎఫ్ఏసీగా విజయవంతంగా పనిచేశానని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన, హింసాత్మక సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని రాజమహేంద్రవరం క్రైస్తవ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని, క్రైస్తవులపై దాడులు చేస్తూ చర్చిలను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రెవరేండ్ గెద్దం నెల్సన్ బాబు, ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ మావ్వళ్ల రమేష్ కుమార్, రెవరెండ్ ఆర్థర్ ప్రసాద్ మాట్లాడారు. హింసాత్మక ఘటనలతో సుమారు 54 వేల మంది క్రైస్తవులు ఆ రాష్ట్రం నుంచి వెళ్లిపోయారన్నారు.

ఆదర్శనీయం

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య సమరంలో కఠిన కారాగార శిక్షలు అనుభవించిన పాలకోడేటి కుటుంబం రాజమహేంద్రవరానికే ఆదర్శనీయమని ఆంధ్రకేసరి యువజన సమితి గౌరవ అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు పాలకోడేటి శ్యామలాంబ జయంతి సందర్భంగా సోమవారం స్వాతంత్ర్య సమరయోధుల పార్కులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేశారు. వక్తలు మాట్లాడుతూ శ్యామలాంబ శాసనోల్లంఘన ఉద్యమంలో జైలుశిక్ష అనుభవించారన్నారు. ఆమె భర్త సూర్యప్రకాశరావు ఇన్నీసుపేట బ్యాంకు వ్యవస్థాపకులన్నారు. శ్యామలాంబ బావ గురుమూర్తి ప్రముఖ వైద్యులు, స్వాతంత్ర్య సమరయోధులు అన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్, లంక సత్యనారాయణ, దేశిరెడ్డి బలరామనాయుడు, పాలెపు కల్యాణి, ఏడుకొండలు, నరవ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

జేఎల్‌బీ నగర్‌లో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌కు చెందిన పులిదిండి నాగమణి కొడుకు, కోడలుతో కలిసి ఉంటోంది. ఆమె రామకృష్ణనగర్‌లోని సాయిబాబాగుడిలో సేవ చేస్తుంటుంది. సోమవారం కొడుకు, కోడలు పనిమీద బయటకు వెళ్లగా నాగమణి సేవకోసం సాయిబాబా గుడికి వెళ్లింది. తిరిగి రాత్రి ఏడుగంటలకు ఇంటికి వచ్చే సరికి తాళం పగలుగొట్టి ఉన్నాయి. ఇంటిలోని మూడు పట్టుచీరలు, 20 తులాల వెండి కుందులు, రూ.20 వేలు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్.శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హౌస్ అరెస్టు కక్ష సాధింపే..

రాజమహేంద్రవరం సిటీ: తిరుమలాయపాలెం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, పోలీసులు కక్షకట్టి వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్ధరాత్రి సమయంతో గ్రామస్తులపై పోలీసులు దాడి చేసి విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారన్నారు. బాధితులను పరిమర్శించేందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్న తనను హౌస్ అరెస్ట్ చేయడం ప్రభుత్వం కక్షసాధింపు చర్యేనన్నారు.

యువకుడిపై కేసు

కంబాలచెరువు: ఆరేళ్లుగా తనని ప్రేమించి, పెళ్లి అనే సరికి ముఖం చాటేస్తున్నాడంటూ కాతేరుకు చెందిన ఓ యువతి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కడియానికి చెందిన వీరబాబు, కాతేరుకు చెందిన యువతి రాజీవ్‌గాంధీ కాలేజీలో చదువుకునేవారు. వారిద్దరూ 2017 నుంచి ప్రేమించుకుంటున్నారు. వీరబాబుకి చైతన్య గోదావరి బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. తర్వాత పెళ్లి కోసం ఆ యువతి వీరబాబుని అడిగేసరికి తప్పించుకుంటున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

విద్యాకానుకతో స్వాగతం



కంటిపూడి రామారావు హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి



కడియంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో లజపతిరాయ్, వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు



దుళ్లలో కిట్లు అందజేస్తున్న సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు

- పాఠశాలల పునఃప్రారంభం
- తొలిరోజే విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ
- పండగలా కార్యక్రమం

కంబాలచెరువు: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యార్థుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. నాడు – నేడులో విద్యాలయాలను ఎంతో అభివృద్ధి చేసి, అన్ని వసతులు కల్పించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేశారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గంలో సోమవారం పండగలా ఈ కార్యక్రమం జరిగింది. కానుక అందుకున్న విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. జగన్ మామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

చదువే ఆభరణం

చదువే మనిషికి ఆభరణమని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ మండల స్థాయి జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం సోమవారం స్థానిక కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా కమిషనర్ హాజరయ్యారు. ముందుగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ నివేదిక అందజేశారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 17,232 జేకేవీ కిట్లను అందజేస్తున్నామన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూ జగన్ మావయ్య విద్యాకానుక రూపంలో బ్యాగ్‌తో పాటు పుస్తకాలు, షూ, యూనిఫాం, బెల్ట్‌లను పాఠశాల మొదటి రోజునే ఇవ్వడం సంతోషమన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.దుర్గాప్రసాద్ ఆహూతులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీసెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఈఎస్ఐ డైరెక్టర్ షోడదాసి సుందర్ సింగ్, మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, సాలా సావిత్రి, పాఠశాల పీఎంసీ చైర్మన్ ఎం.జయశంకర్ పాల్గొన్నారు.

- నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ మీడియం స్కూల్లో జేవీకే కిట్లను వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న చేస్తున్న కృషికి రాష్ట్ర ముస్లిం సమాజం నూటికి నూరు శాతం అండగా నిలబడుతుందన్నారు. స్కూల్ హెచ్ఎం షేక్ ముర్తుజా, టి.సరో జినీ, షేక్ నజీమున్నీసా పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్‌ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంఈవో వి.లజపతిరాయ్, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), పీఎంసీ చైర్మన్ ఎస్.లక్ష్మి పాల్గొన్నారు. గిరజాల బాబు మాట్లాడుతూ పేదలకు సైతం ఉన్నత స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. స్థానిక నాయకులు ఉప్పులూరి హనుమంతరావు, శాక పట్టాభి, దొడ్డా బుజ్జి, ఆర్ఎస్ఎన్ మూర్తి, బండారు శ్రీనివాసరావు, గుత్తుల వాసు, కొత్తూరి బాలనాగేశ్వరరావు, పెంకే రామకృష్ణ, పూడి వీరబ్రహ్మం, కందా రాజు, దంగుడుబియ్యం సుబ్బారావు, మూర్తి, రమేష్ పాల్గొన్నారు.

- దుళ్ల హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కట్టుంగ నాగరాజు, పుత్సల బసవశంకరం, వైఎస్సార్ సీపీ నాయకులు తాతపూడి బాబీ, కంటిపూడి సాయి, సోమేష్, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొని విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కాతేరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కాతేరులో గడపగడపకూ..

రాజమహేంద్రవరం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన కాతేరు గ్రామ సచివాలయం–1లోని బసవేశ్వరస్వామి ఆలయం నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి దేవాంగులపేట, దాసరి నగర్, పోలిన టవర్స్, టవర్ స్ట్రీట్, బ్యాంక్ ఆఫ్ బరోడా వెనుక ప్రాంతాలలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు సంక్షేమం పూర్తి స్థాయిలో అందిందా లేదా అనే విషయాన్ని గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా తెలుసుకుంటున్నామన్నారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆచంట సుబ్బారాయుడు, పార్టీ నాయకులు యెజ్జు వాసు, ఆచంట కల్యాణ్, పెనుమాక సునీల్, వానపల్లి అప్పారావు, దేవమాత, కప్పల సూర్యకుమారి, రాజేశ్వరి, గ్రామ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ధవళేశ్వరం: చెన్నైకి చెందిన ఓ బాలిక ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించింది. ఆమెను రాజమహేంద్రవరంలో ఇంటర్‌లో చేరేందుకు ధవళేశ్వరంలోని బంధువుల ఇంటికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం బాలిక అదృశ్యమైంది. అన్నిచోట్లా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించారు. కేసును ఎస్సై క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా శంకుస్థాపనలు



సీతానగరంలో సీతారామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: నియోజకవర్గంలో ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని పలు ఆలయాల పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపనలు చేశారు. ముందుగా సీతానగరంలో సీతారామాలయం, అక్కడి నుంచి కాటవరంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు.

117 ఆలయాల నిర్మాణం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో 117 ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీతానగరంలో సీతారామాలయానికి సుమారు రూ.60 లక్షలు ఖర్చవుతుందని, అందులో రూ.40 లక్షలను దేవదాయ, ధర్మదాయశాఖ సీజీఎఫ్ ద్వారా కేటాయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిగిలిన రూ.20 లక్షలు ఆలయ కమిటీ భరిస్తుందన్నారు. కాటవరంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.75 లక్షలు వ్యయం అవుతుందని, దేవదాయ, ధర్మదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు, గ్రామస్తుల విరాళం రూ.20 లక్షలు, ఆలయ కమిటీ ప్రోత్సాహకారంగా రూ.5 లక్షలు వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రుపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, చల్లమళ్ల సుజీరాజు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, చిర్రవూరి మధుసూదనరావు, మట్ట వసంతరావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణపట్నంలో..

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో గ్రామ దేవత సత్తెమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం భూమిపూజ చేశారు. సుమారు రూ. 25 లక్షలతో నిర్మాణం జరగనున్న ఈ ఆలయానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని సీఆర్‌పీల వినతి



హోంమంత్రి తానేటి వనితకు సమస్యలను విన్నవిస్తున్న సీఆర్‌పీలు

రాజమహేంద్రవరం రూరల్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లకు 11 పీఆర్‌సీ ప్రకారం జీతాలు పెంపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితకు సీఆర్‌పీలు వినతిపత్రం అందజేశారు. సోమవారం శాటిలైట్‌సిటీ గ్రామంలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం అనంతరం సీఆర్‌పీలు చినబాబు, రామ్, ప్రతాప్, రఘు తదితరులు ఆమెను కలిసి తమ సమస్యలను విన్నవించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ, గోరుముద్ద, అమ్మ ఒడి, నాడు–నేడు పనుల్లో భాగస్వాములై విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు.

అవుట్ పోలీస్‌స్టేషన్‌ను పునరుద్ధరించాలి

శాటిలైట్‌సిటీలో 2012లో ఏర్పాటు చేసిన అవుట్‌పోలీస్ స్టేషన్‌ను సిబ్బంది లేరన్న కారణంతో తాత్కాలికంగా మూసివేశారని, దానిని పునరుద్ధరించాలని హోంమంత్రి తానేటి వనితకు వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌తో కలిసి స్థానిక పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే కలెక్టర్ మాధవీలతకు శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని, అలాగే ఖాళీస్థలంలో విద్యుత్ స్తంభాలను మార్పించాలని కోరారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్రవర్షిణి అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, భూవివాదం, పౌరసరఫరాలు తదితర అంశాలకు సంబంధించి ఐదుగురు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు చేపడుతున్నట్టు నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి 16 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవేణి, సిటీ ప్లానర్ జె.సూరజ్ కుమార్ పాల్గొన్నారు.

సీలింగ్ భూములపై సమగ్ర విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 33 వేల ఎకరాల సీలింగు భూములు మాయం కావడంపై నలుగురు కలెక్టర్లు బాధ్యత వహించాలని ఆదివాసీ మహాసభ డిమాండ్ చేసింది. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసి మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 34,348 ఎకరాల సీలింగు మిగులు భూములు ఉన్నాయని వాటిలో 15,500 ఎకరాలు పంపిణీ జరిగిందని అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ సీసీఎల్‌కు నివేదిక పంపారన్నారు. సీసీఎల్ఏ ఈ వివరాలను కోనేరు రంగారావు భూకమిటీకి నివేదించిందని, సుమారు 18,848 ఎకరాలు కోర్టు వివాదాలలో ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన భూపంపిణీ కార్యక్రమంలో సీలింగు భూములు పంచలేదన్నారు. కోర్టు పెండింగ్‌లో వున్న 18,848 ఎకరాల సీలింగు భూములను 2019లో అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ రిజిస్ట్రేషన్ చట్టం 1908 సెక్షన్ 22ఎ ప్రకారం నిషేధిత భూముల జాబితాలో చేర్చాల్సి ఉందన్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయాలని, కానీ కలెక్టర్ చర్యలు తీసుకోలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో 34,348 ఎకరాల సీలింగు భూములు ఉండగా కేవలం 945 ఎకరాలకు మాత్రమే సెక్షన్ 22ఎ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేశారని మిగిలిన 33 వేల ఎకరాలకు పైగా వున్న సీలింగు భూముల వివరాలకు నోటిఫికేషన్ జారీ చేయలేదన్నారు. సమావేశంలో ఆదివాసి మహాసభ నాయకులు అరగంటి వీరభద్రారెడ్డి, జక్కల పాండవులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సీతానగరం: ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత సేవాదళ్‌పై ఉందని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జులకు సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పలు సూచనలు అందించారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజల్లోకి ప్రభుత్వ పనితీరును తీసుకువెళ్లాలని సూచించారన్నారు.

టీడీపీ మినీ మేనిఫెస్టోపై చర్చ

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని ప్రియాంక ఫంక్షన్ హాల్లో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన సోమవారం రూరల్ నియోజకవర్గ స్థాయి టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్తుకు గ్యారంటీ మినీ మేనిఫెస్టోపై చర్చ నిర్వహించారు. మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన ఆరు పథకాలతో తొలివిడత మినీ మేనిఫెస్టోపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి సత్యప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, రాష్ట్ర రైతు కార్యదర్శి అన్నందేవుల చంటి, రూరల్ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్ పాల్గొన్నారు.

చదువుకు అన్నివిధాలా సాయం

రాజమహేంద్రవరం సిటీ: చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిని చదివించేందుకు రాజమహేంద్రి ఉచిత సహాయ విద్యా కేంద్రం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి సంబంధించి ఎటువంటి సలహాలు, సహాయం కావాలన్నా చేసేందుకు రాజమహేంద్రి ఉచిత సహాయ విద్యా కేంద్రం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చుతామన్నారు. సెల్‌ఫోన్‌లో వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఎలా ఉపయోగించాలనేది కూడా నేర్పిస్తామన్నారు. అవసరమైన వారు తన సెల్ 94401 79277 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

భూలోకమ్మ తల్లికి పూజలు



చందన నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ధవళేశ్వరం: స్థానిక వాడపేటలో భూలోకమ్మ తల్లి సంబరాల సందర్భంగా జరిగిన ఊరేగింపు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయం–2 కన్వీనర్ పేర్ల దుర్గాప్రసాద్, పుక్కళ్ల రాజు, కమిటీ సభ్యులు చందన నాగేశ్వర్‌కు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు తలారి వరప్రసాద్, సాధనాల చంద్రశేఖర్ (శివ), మెండా రాజేష్, నాయకులు మెండి రాంబాబు, దాసరి వెంకన్న, మైలపల్లి వెంకన్న పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కడియం: మండలంలోని దుళ్లలోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు బాదంపూడి సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో వేద పండితుల సమక్షంలో పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

కడియం: తమ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని వేమగిరి సచివాలయం వద్ద ఆ గ్రామంలోని జక్కంపూడి నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. సచివాలయంలో బైఠాయించి తమ నిరసన తెలిపారు. కాలనీలో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండడం లేదని, విద్యుత్, తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధవళేశ్వరం: విద్యుత్ మరమ్మత్తుల కారణంగా మంగళవారం రాజవోలు, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఎర్రకొండ, రాజవోలు 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు ఉండదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కంబాలచెరువు: దురాచారాల నుంచి శాస్త్రీయత వైపు ప్రజలను నడిపించేందుకు జన విజ్ఞాన వేదిక కృషిచేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎన్.రవిబాబు మాట్లాడుతూ ఆధునిక యుగంలో కూడా కొందరు విజ్ఞానాన్ని వదలి అజ్ఞానం వైపు పయనిస్తున్నారన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ సీహెచ్ నిశ్చల్, మణికంఠ, గోపికృష్ణ పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ

ప్రకాశం నగర్: ఐఫోకస్ మిషన్ సభ్యులు వెటర్నరీ డాక్టర్ శ్రీ కిరణ్ యర్రంశెట్టి రచించిన 'నాన్నకేం తెలుసు' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం స్థానిక తిలక్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ నివాసంలో జరిగింది. వాసు తొలి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాన్న చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

కడియం: స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి మాట్లాడుతూ విద్యుత్ కోతలతో నర్సరీ రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం ఏఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

సినిమాలు



శ్యామల : అహింస
సూర్యమినీ : విమానం
సూర్యప్యాలెస్ : ట్రాన్స్‌ఫార్మర్స్
స్వామి : బిచ్చగాడు–2
శివజ్యోతి : ఇంటింటి రామాయణం
అనుశ్రీ : ట్రాన్స్‌ఫార్మర్స్
రాజా : ట్రాన్స్‌ఫార్మర్స్
అశోక : టక్కర్
ఊర్వశి : అన్‌స్టాబుల్
రంభ : విమానం
మేనక : యూనివర్సిటీ
అప్సర : 2018

నామవరం
వీఎస్ మహల్ : ట్రాన్స్‌ఫార్మర్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : టక్కర్

కడియం
వెంకటసూర్య : టక్కర్